జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 26 | మార్చి | 2026 ◆ పేజీలు : 6

## నేత్రపర్వంగా రామాలయంలో ధ్వజారోహణం

- నేడు స్వామి వారికి మిథిలా స్టేడియం వద్ద ఎదుర్కోలు ఉత్సవం
- పట్టు వస్త్రాలు సమర్పించనున్న దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి



**భద్రాచలం, మార్చి 25, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో నిర్వహిస్తున్న వసంత పక్ష తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రామాలయంలో ధ్వజా రోహణం నేత్రపర్వంగా సాగింది. శ్రీ మహావిష్ణువు ప్రీతిపాత్రుడైన గరుత్మంతునిపటాన్ని ఆలయ ధ్వజస్తంభం పై వైదిక బృందం ఎగురవేశారు. బుధవారం

మిగతా 2 లో...

- చిట్టిరామవరం సర్వే నెంబర్ 20లో రియల్టార్ హావా?
- ల్యాండ్ యూజ్ కన్వర్షన్ చట్టబద్ధమేనా...?
- పెద్ద స్థాయి రియల్ ఎస్టేట్ స్కామ్‌గా మారే ప్రమాదమా?
- అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఆలస్యం చేస్తే ప్రజల విశ్వాసం దెబ్బతింటుందా?

2 లో..



# అసలు ఎవరు ఈ ఆర్.కె...?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చిట్టిరామవరం పరిధిలోని సర్వే నెంబర్ 20లో వెలుగులోకి వచ్చిన అక్రమ వెంచర్ వ్యవహారం రోజురోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. సరైన అనుమతులు లేకుండానే వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రియల్ ఎస్టేట్ దందాపై ప్రశ్నించిన పాత్రికేయులపై రియల్టార్ కన్నెర్ర చేస్తున్నట్లుగా సమాచారం. అసలు ఎవరు ఈ రియల్టార్ ఆర్.కె అన్నది కొత్తగూడెంలో చర్చనీయాంశంగా మారింది. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న వారిపై రియల్టార్ ఆర్.కె మరియు అతని అనుచరులు బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇలాంటి బెదిరింపులకు మీడియా తలవంచదని జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

● కొత్తగూడెం , ప్రజాజ్యోతి



## శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాచలం, మార్చి 25, ప్రజాజ్యోతి:** భద్రాచలం మిథిలా స్టేడియం వద్ద జరుగుతున్న శ్రీరామనవమి మహోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్ల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, శిక్షణ కలెక్టర్ సౌరభ్ శర్మ, దేవస్థానం కార్యనిర్వాహణాధికారి దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులతో మాట్లాడిన కలెక్టర్, ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా నిర్వహించనున్న భూమి పూజ కార్యక్రమం, అలాగే శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేడియం పరిధిలో ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, ముఖ్యంగా వివిఐపి సెక్టార్లలో బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అవసరమైన మెరుగులు చేర్చాలని అధికారులకు సూచించారు. శ్రీరామనవమి ఉత్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## భద్రాద్రి రామాలయ అభివృద్ధికి రూ.351 కోట్లు మంజూరు



**భద్రాచలం, మార్చి 25, ప్రజా జ్యోతి:** దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ పునరాభివృద్ధి, పునరుజ్జీవన పనులకు ప్రభుత్వం రూ.351 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ డైరెక్టర్

మిగతా 6 లో...

# 'మిషన్ 2026' కీలక దశలోకి...!

- లొంగిపోయిన 18 మంది మావోయిస్టులు
- లొంగిపోయిన మావోయిస్టులపై 87 లక్షల రివార్డ్
- లొంగిపోయిన వారిలో ఏడుగురు మహిళలు
- ఎస్‌జెడ్‌సిఎం పాపారావు పై 25 లక్షల రివార్డ్
- ఆయుధాలు నగదు అధికారులకు అప్పగింత



**చర్ల, మార్చ్ 25:(ప్రజా జ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలోని జగదల్పూర్ లో బుధవారం" పునర్వాసం ద్వారా పునర్జీవనం" కార్యక్రమంలో భాగంగా డి కె ఎస్ జెడ్ సి కు చెందిన 18 మంది మావోయిస్టు కేడర్లు వారిలో ఏడుగురు మహిళలు హింస మార్గాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి ఎస్ జెడ్ సి ఎం పాపారావు సహా 18 మంది మావోయిస్టులు లొంగిపోయారు . దల్పూర్‌లోని శౌర్యభవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. పోలీస్ లు భద్రతా దళాల ఉన్నతాధికారుల సమక్షంలో మావోయిస్టులు లొంగిపోయారు.వీరిపై మొత్తం రూ. 87 లక్షల బహుమతి ప్రకటించారు. పునర్వాస సమయంలో ఏ కె – 47, ఎస్ ఎల్ ఆర్ , ఇన్సాస్ సహా మొత్తం 18 ప్రాణాంతక ఆయుధాలు రూ. 12 లక్షల నగదును మావోయిస్టులు ప్రభుత్వానికి అప్పగించారు. దండకారణ్య ప్రాంతంలో ఎస్ జెడ్ సి స్థాయి చివరి ప్రభావవంతమైన నాయకుడు పాపారావ్

మిగతా 2 లో...

## నేత్రపర్వంగా రామాలయంలో ధ్వజా రోహణం



(మొదటి పేజీ తరువాయి...)

నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు సంకేతంగా అటు దేవతలకు, ఇటు మానవు లకు తెలిపే విధంగా ఈ ధ్వజారోహణ జరుపుతారు. అలాగే అష్టదిక్పా లకులు, పంచలోక పాలకులు, దేవతలకు ఆహ్వానించే భేరిపూజ కార్యక్రమాన్ని ఆచార్యులు వైభవంగా జరిపారు. ఆ తర్వాత ఆయా దేవతలకు ఇష్టమైన ప్రసా దాలను అర్పించి బ్రహ్మో త్సవాల సమయంలో ఆలయంలో ఉండి స్వామిని దర్శించే భక్తులకు శుభాలు కలిగేలా దీవించాలని కోరుతూ కార్య క్రమాలు నిర్వహించారు. అనంతరం గరుడ ప్రసాదంను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో దేవస్థానం ఈవో దామోదర్‌రావు, ఏఈవో శ్రావణకుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారాములు, అమరవాది విజయరాఘవన్, వైదిక బృం దం పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం రామయ్య కల్యాణం సందర్భం గా గురువారం రాత్రి స్థానిక మిథిలా స్టేడియం వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో కీలకమైన ఎదుర్కోలు సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ ముఖ్య కార్య దర్శి శైలజ రామయ్యర్ హాజరై పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

## మిషన్ 2026' కీలక దశలోకి...!



(మొదటి పేజీ తరువాయి...)

తన అనుచరులతో కలిసి పునర్వాసం పొందాడు. 01 జనవరి 2024 నుండి 25 మార్చి 2026 వరకు మొత్తం 2756 మంది మావోయిస్టులు పునర్వాసం పొందారు.ముఖ్యంగా ఎస్ జెడ్ సి ఏం పాపారావ్, డి వి సి ఏం అనిల్ తాటి, డి వి సి ఏం ప్రకాశ్ మాడ్వీ వంటి సీనియర్ కేడర్లు జనజీవన స్రవంతిలోకి చేరారు. పునర్వాసం పొందిన వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల ప్రకారం భద్రత, గౌరవప్రద జీవితం, ఉపాధి అవకాశాలు కల్పించబడతాయి అని అధి కారులు అన్నారు .

**స్వాధీనం చేసుకున్న ఆయుధాలు:**
ఎనిమిది ఏ కె –47 రైఫిల్స్,ఒక ఎస్ ఎల్ ఆర్,ఒక ఇన్సాస్, నాలుగు 303 రైఫిల్స్, ఒక 9ఎం ఏం పిస్టల్,రెండు సింగిల్ షాట్ గన్స్,ఒక బి జి ఎల్ లాంచర్ తోమొత్తం 18 ఆయుధాలు రూ. 12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.లొంగిపోయిన మావోయిస్టు కేడర్లలో ఎస్ జెడ్ సి ఏం –ఒకరు ,డి వి సి ఏం –ముగ్గురు , పీ పీ సి ఏం –నలుగురు , ఏ సి ఏం –ఇద్దరు , ఎల్ ఓ ఎస్ సభ్యులు–ఇద్దరు పార్టీ సభ్యులు–ఆరుగురు ఉన్నారు. “పూనా మార్గేం” కార్యక్రమం ద్వారా హింసను విడిచిన యువతకు పునర్వాసం, భద్రత, గౌరవ ప్రద జీవితం కల్పించడమే లక్ష్యం అని మిగిలిన మావోయిస్టులకు పోలీసులు పిలుపునిచ్చారు హింసను విడిచిపెట్టి జనజీవన స్రవంతి లోకి రావాలని అన్నారు.

**పాపారావ్ వివరాలు:** 1997లో సంస్థలో చేరాడు. 2004లో ఏరియా కమిటీ ఇన్‌చార్జ్‌గా పనిచేశాడు. 2018 నుండి పశ్చిమ బస్తర్ బాధ్యతలు నిర్వహిం చాడు. అతనిపై 25 లక్షల రివార్డ్ ఉంది.అతనిపై 48 కేసులు, 41 వారెంట్లు నమోదయ్యాయి.

**అనిల్ తాటి వివరాలు:** 2006లో సంస్థలో చేరాడు. 2016లో డి వి సి ఏం గా ఎదిగాడు. అతనిపై రూ. 8 లక్షల రివార్డ్ ఉంది.

**ప్రకాశ్ మాడ్వీ వివరాలు:** 2011లో సంస్థలో చేరాడు. ప్లాటూన్ కమాండర్‌గా పనిచేశాడు. అనేక ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నాడు.

**విలాస్ అవలం వివరాలు:** 2009లో సంస్థలో చేరాడు. ఐ ఈ డి నిపుణుడిగా పనిచేశాడు. అతనిపై రూ. 8 లక్షల రివార్డ్ ఉంది. పునర్వాసం పొందిన వారికి ఆర్థిక సహాయం, శిక్షణ, నివాసం, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించబడ తాయి అని ఈ చర్యతో మావోయిస్టు సంస్థకు భారీ దెబ్బ తగిలింది అని ఈ ప్రాంతంలో భద్రత మెరుగుపడి అభివృద్ధి పనులకు ఊతం లభిస్తుంది అని అధి కారులు అభిప్రాయపడ్డారు.

- చిట్టిరామవరం సర్వే నెంబర్ 20లో రియల్టార్ హవా?
- ల్యాండ్ యూజ్ కన్వర్షన్ చట్టబద్ధమేనా...?
- పెద్ద స్థాయి రియల్ ఎస్టేట్ స్కామ్‌గా మారే ప్రమాదమా?
- అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఆలస్యం చేస్తే ప్రజల విశ్వాసం దెబ్బతింటుందా?



# అసలు ఎవరు ఈ ఆర్.కె...?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చిట్టిరామవరం పరిధిలోని సర్వే నెంబర్ 20లో వెలుగులోకి వచ్చిన అక్రమ వెంచర్ వ్యవహారం రోజురోజుకీ కొత్త మలుపులు తిరుగుతోంది. సరైన అనుమ తులు లేకుండానే వ్యవసాయ భూమిని ప్లాట్లుగా మార్చి విక్ర యించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ఆరోపణలు విని పిస్తున్నాయి. ఈ రియల్ ఎస్టేట్ దందాపై ప్రశ్నించిన పాత్రికే యులపై రియల్టార్ కన్నెర్ర చేస్తున్నట్లుగా సమాచారం.**

**అసలు ఎవరు ఈ రియల్టార్ ఆర్.కె అన్నది కొత్తగూడెంలో చర్చనీయాంశంగా మారింది. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న వారిపై రియల్టార్ ఆర్.కె మరియు అతని అనుచ రులు బెదిరింపులకు దిగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. అయితే ఇలాంటి బెదిరింపులకు మీడియా తలవం చదని జర్నలిస్టు వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.**

● కొత్తగూడెం , ప్రజాజ్యోతి

### ››› భూమి క్లియరెన్స్ లేకుండానే కోట్ల దందా?

సుమారు 9 ఎకరాల వరకు వ్యవసాయ భూమిని ప్లాట్లుగా విభజించి, సరైన అనుమతులు లేకుండానే కోట్ల రూపాయల వ్యాపారానికి సన్నాహాలు వేగంగా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తు న్నారు. భూమి ల్యాండ్ యూజ్ మార్పు జరిగిందా లేదా అన్నదానిపై స్పష్టత లేకుండానే వెంచర్ పేరుతో ప్లాట్లు విభజించడం పలు అనుమానాలకు దారితీస్తోంది.

### ››› తక్కువ ధరలో ప్లాట్లు అంటూ మోసం?

కొంతమంది రియల్టార్లు కొత్తగూడెం చుట్టుపక్కల అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసి ముఖ్యంగా మధ్య తర గతి కుటుంబాలనే లక్ష్యంగా చేసుకుని తక్కువ ధరలో ప్లాట్లు అంటూ ఆకర్షించి అమాయక ప్రజ లను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. త్వరగా ప్లాట్లు కొనండి ఇప్పుడు కొనకపోతే రేటు మరింతగా పెరుగుతుంది ఇది లాస్ట్ ఛాన్స్ అంటూ ప్రలోభపెట్టి ప్లాట్లు అమ్ముతున్నారని స్థాని కులు చెబుతున్నారు. సరైన అనుమతులు లేకుండా ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో రిజిస్ట్రేషన్, నిర్మాణ అనుమతుల విషయంలో తీవ్ర సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

### ››› ల్యాండ్ యూజ్ కన్వర్షన్ జరిగిందా...?

సర్వే నెంబర్ 20లోని భూమికి ల్యాండ్ యూజ్ కన్వ ర్షన్ చట్టబద్ధంగా జరిగిందా? వెంచర్‌కు అవసర మైన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అనుమతులు తీసుకు న్నారా? అనే ప్రశ్నలకు ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లభించలేదు. అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయిస్తుంటే సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. ఈ వ్యవహారంపై అధికారుల మౌనం పలు అనుమానాలకు తావిస్తోంది. సుమారు 9 ఎకరాల వ్యవసాయ భూమిలో వెంచర్ పేరిట రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు బహిరంగంగానే కొనసాగుతున్నా యని స్థానికులు చెబుతున్నారు. అక్రమాలు జరుగు తున్నాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

### ››› సుజాతనగర్ బాధితుల్లా మిగిలిపోతారా...?

ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో అక్రమ వెంచర్ల వల్ల ప్రజలు నష్టపోయిన ఘటనలు ఉన్ననేపథ్యంలో చిట్టిరామవరం కొనుగోలుదారులు కూడా అదే పరి స్థితిని ఎదుర్కొనే ప్రమాదం ఉందన్న భయాలు వ్యక్త మవుతున్నాయి. గతంలో జరిగిన ఘటనల్లో పెట్టుబ డులు పెట్టిన వారు ప్లాట్లు ఉన్నా ఇంటి నిర్మాణ అను మతులు లేక ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నా యని స్థానికులు గుర్తుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో సరైన ధృవీకరణలు లేకుండా కొనుగోలు చేయడం వల్ల డబ్బులు చిక్కుకుపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. సంబంధిత శాఖలు ముందు గానే తనిఖీలు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే మరిన్ని కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడు తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ››› ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా...?

ఈ అక్రమ వెంచర్ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థాని కులు, జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఇది పెద్ద స్థాయి రియల్ ఎస్టేట్ స్కామ్‌గా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో ఆలస్యం చేస్తే ప్రజల విశ్వాసం దెబ్బతినే అవకాశం ఉందని అభిప్రాయపడుతు న్నారు. సంబంధిత శాఖలు వెంటనే రంగంలోకి దిగి నిజానిజాలు వెలికితీయాలని కోరుతున్నారు.



# పరిశుభ్రత అప్రమత్తతోనే విష జ్వరాలకు స్వస్తి

- -ఇల్లెందులో టైఫాయిడ్ అధికం
- -హ్యాండ్ వాష్, పరిస రాలు, వ్యక్తిగత పరిశు భ్రత ముఖ్యం
- -వైద్యశాలలో ఎప్పటిక ప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలి
- -ఇల్లందు, మణుగూరు, చర్ల పాల్వంచలకు అంబులెన్స్ కోసం కృషి
- -ఇన్సులిన్, పాన్ టాప్ ఇంజక్షన్ల కొరతను తీరుస్తాం:డిసిహెచ్ఎస్ డాక్టర్. జి రవిబాబు



ఇల్లెందు, మార్చి 25, (ప్రజాజ్యోతి): వేసవి కాలంలో ప్రజలు హిట్ ఫీ వర్స్, టైఫాయిడ్ జ్వరాల నుంచి విముక్తి పొందేందుకు వేసవిలో అత్యవసమైతేనే తప్ప బయటకు వెళ్లకుండా, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చేతులను తప్పనిసరిగా శుభ్రం చేసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డిసిహెచ్ఎస్ డాక్టర్ జి. రవిబాబు సూచించారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, వైద్యశాలలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను, వందలాదిగా వస్తున్న రోగులను పరిశీలిస్తూ అందిస్తున్న వైద్య సేవలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం కావడంతో వార్డులలో రోగులకు సరైన గాలి లేకపోవడంతో వెంటనే చల్లదనాన్ని ఇచ్చే కూలర్లను ఏర్పాటు చేయాలన్నారు. కిటికీలు, డోర్లకు కర్టెన్స్ ను సిద్ధం చేయాలని సూచించారు. బర్త్ వెయిటింగ్, పీడియాట్రిక్ రూమ్స్ లో ఏసీలు ఏర్పాటు చేసే వరకు కూలర్లను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వైద్యశాలను పారిశుద్ధ్య లోపం లేకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కోరారు. వైద్యశాలకు వచ్చే రోగులకు వారి సహాయకులకు వేసవికాలం కావడం వల్ల త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇల్లెందుతో పాటు మణుగూరు, చర్ల, పాల్వంచ మండలాలకు రోగుల అవసరాల దృష్ట్యా అంబులెన్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు త్వరలోనే అంబులెన్స్ ఏర్పాటుకు జిల్లా ఉన్నతాధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని స్పష్టం చేశారు. ఇల్లెందు వైద్యశాలలో ఇన్సులిన్, పాన్ టాప్ ఇంజక్షన్ల కొరత ఉందని త్వరలోనే వాటిని వెంటనే పరిష్కరిస్తామని, అవసరమైతే అశ్వారావుపేట, పాల్వంచ వైద్యశాలల నుంచి తెప్పించి అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. వైద్యశాలలో రోగుల సహాయకుల కోసం నిర్మించవలసిన షెడ్లకు సంబంధించి గుత్తేదారులు ముందుకు రావట్లేదని అందుకు సంబంధించి సమస్య పరిష్కారానికి షెడ్ల నిర్మాణానికి టెండర్లు త్వరలోనే నిర్వహించి పూర్తి చేస్తామన్నారు. త్వరలో జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. వైద్యశాల విధుల్లో గైనకాలజిస్ట్ మినహాయించి మిగిలిన వైద్యులను వినియోగించుకోవాలని సూచించారు. వైద్యశాలకు వచ్చే రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది మర్యాదగా మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, వైద్యులు బన్నీలాల్, శేఖర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు

- గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతాంగం



అశ్వారావుపేట, మార్చి 25,(ప్రజాజ్యోతి): ఎన్ఎల్ఎస్ ప్రాంతంలోని పొగాకు కొనుగోళ్ళ వేలానికి బుధవారం జంగారెడ్డిగూడెం 32 ప్లాట్ ఫామ్ లో బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. గత సంవత్సరం ప్రారంభ గరిష్ఠ ధర రూ.290 ఉండగా ఈ సంవత్సరం గరిష్ఠ ప్రారంభధర రూ.25 తక్కువగా రూ.265 నుంచి ప్రారంభమైంది. రైతులు నష్టపోకుండా గిట్టుబాటు ధర కల్పించేలా బోర్డు అధికారులతో పాటు కొనుగోలుదారులు చొరవ చూపాలని రైతు సంఘ నాయకులు కోరుతున్నారు. ఐటీసీ, జీపిఐ, పిఎస్ఎస్, డెక్కన్ కంపెనీలు ఈ పొగాకు కొనుగోళ్లలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో టొబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ ఆర్.ఎం సురేంద్ర, ఏఎస్ మార్గరేట్ గ్రేస్, రైతు సంఘం అధ్యక్షులు సత్రం వెంకటరావు, కార్యదర్శి వి వి ఎస్ ప్రకాష్ రావు రైతు సంఘం నాయకులు అశ్వారావుపేట ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, కుకులకుంట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో తల సేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరం






కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 25,(ప్రజా జ్యోతి): ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా పాల్వంచ ఎస్పీఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో తల సేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం స్థానిక కేటీపీఎస్ ఏడవ దశ కర్మాగారం ప్రాంగణంలోని ఎస్పీఎఫ్ కమాండెంట్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీఎఫ్ కమాండెంట్ వి కోటేశ్వరరావు, కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్లు ప్రభాకర్ రావు, జై సూర్యనారాయణ రావులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ టీజీ ఎస్పీఎఫ్ స్వాతి లక్రా ఆదేశాల మేరకు తల సేమియా చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది ఎస్పీఎఫ్ సిబ్బందితోపాటు జెన్కో సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ చంద్రశేఖర్, సీఐ డీ కిరణ్, కేటీపీఎస్, ఎస్పీఎఫ్ ,ఉద్యోగులు పాల్గొన్నారు.

## రక్తదానం సమాజానికి అత్యంత అవసరమైన సేవ : డీఎస్పీ ఆదినారాయణ



కొత్తగూడెం, మార్చి 25 ( ప్రజాజ్యోతి ):రక్తదానం సమాజానికి అత్యంత అవసరమైన సేవ అని యువత ఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ సూచించారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందితే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా ఆసుపత్రిలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజ సేవలో ముందుండాలని సూచించారు. ప్రతి వ్యక్తి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా మరొకరి జీవితానికి అండగా నిలవవచ్చని పేర్కొన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు జె. బాలు మాట్లాడుతూ రక్తదానం పై అవగాహన పెంపొందించడం, ప్రతి కుటుంబంలో కనీసం ఒక్క రక్తదాత ఉండేలా చేయడం తమ లక్ష్యమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన రక్తాన్ని అందించడం ద్వారా అనేక మంది ప్రాణాలను రక్షిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు తమ క్లబ్ ద్వారా 46,500 మందికి రక్తం అందించినట్లు వెల్లడించారు. అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకటపుల్లయ్య వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో 37 మంది దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సి.ఐ. ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.




## సాటివారిగూడెం గ్రామ అభివృద్ధికి సహకరించండి

- నవభారత్ ఇండస్ట్రీ సహకారం కోరుతూ సర్పంచ్ వినతి



లక్ష్మీదేవిపల్లి, మార్చి 25 (ప్రజాజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం నవభారత్ ఇండస్ట్రీ యాజమాన్యానికి సర్పంచ్ వజ్జ విజయ భాస్కర్ వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలకు శుద్ధి చేసిన నీరు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో వాటర్ ప్లాంట్ (త్రాగునీటి శుద్ధి కేంద్రం) ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో పూర్తి స్థాయిలో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా కూడలి ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామం నవభారత్ ఇండస్ట్రీకి సమీపంలో ఉండటంతో పరిశ్రమ కార్యకలాపాల వల్ల కలిగే కాలుష్య ప్రభావం కూడా ప్రజలపై పడుతున్నదని సర్పంచ్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కంపెనీ సామాజిక బాధ్యత (సీఎ స్ఆర్ )లో భాగంగా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. తమ గ్రామంలోని పాఠశాలల్లో వసతులు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కూడా వినతిపత్రంలో సూచించారు. నవభారత్ ఇండస్ట్రీ ఉన్నత అధికారి అందుబాటులో లేనందున ఈ వినతిపత్రాన్ని నవభారత్ సెక్యూరిటీ కార్యాలయంలో నవభారత్ ప్లాంట్ సీఎస్ఓ రమణ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్లాంట్ ఉన్నతాధికారులు ప్రస్తుతం బిజీగా ఉన్నారని ఆయన తెలిపారు. గ్రామ అభివృద్ధి అంశాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. నవభారత్ ఇండస్ట్రీ సహకారంతో గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపడి ప్రజారోగ్యం కాపాడబడటమే కాకుండా పరిశ్రమ–గ్రామ సమన్వయం బలోపేతం అవుతుందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**సాటివారిగూడెం సమస్యల పరిష్కారానికి నవభారత్ స్పందించాలని విజ్ఞప్తి: సర్పంచ్ విజయ భాస్కర్**

సాటివారిగూడెం గ్రామ పంచాయతీలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నవభారత్ ఇండస్ట్రీ యాజమాన్యం సహకరించాలని సర్పంచ్ విజయ భాస్కర్ కోరారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి శుద్ధి కేంద్రం, రోడ్లు, డ్రైనేజీ వంటి సౌకర్యాల ఏర్పాటు కోసం సంస్థ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. నవభారత్ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెన్షనర్లకు తీవ్ర నష్టం జరగనుంది



ఇల్లందు టౌన్, మార్చి 25, (ప్రజా జ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల పెన్షనర్ లకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని మండల అధ్యక్షులు డి స్వామిదాస్ అన్నారు. బుధవారం రాష్ట్ర పెన్షనర్స్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఇల్లందు మండలంలో నిరసన దినోత్సవాన్ని నిర్వహించి ఇల్లందు తహసీల్దార్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేసే పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ ను ఉపసంహరించాలని, పెన్షన్ దారులందరికి ఆరోగ్య కార్డులు ఉచితంగా పంపిణీ చేయాలని, బకాయి పడ్డ డిఏ లను వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి రిపోర్ట్ ను తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యంయం చారి, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ రమేష్, కార్యదర్శులు రాంబాబు, ముత్తయ్య, రామ్మూర్తి, లక్ష్మయ్య, కృష్ణప్రసాద్, రాజయ్య, భావనారాయణ, విజయకుమార్, సుధాకర్, రాజమణి, లక్ష్మి, రాధ పాల్గొన్నారు.

## పెట్రోల్,డీజిల్ కొరత లేదు

- రాష్ట్రంలో సరిపడా ఇంధన నిలువలు
- ప్రజలు ఎవరు ఆందోళనకు గురికావద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 25 ,ప్రజా జ్యోతి:**రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్,ఎల్.పి.జి కొరత ఉత్పన్నమయ్యే ప్రసక్తేలేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రధానంగా హైదరాబాద్ లో డీజిల్,పెట్రోల్ బంక్ ల వద్ద పెద్ద ఎత్తున ఉన్న క్యూలను చూసి పెట్రోల్,డీజిల్,ఎల్.పి.జి కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఇంధన వనరులతో పాటు ఎల్.పి.జి కొరత అంటూ వస్తున్న వదంతులతో ప్రజాలేవరు ఆందోళనకు గురికారాదని అన్నారు, ఈ మేరకు రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు, రానున్న మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, జరుగుతున్న వదంతులతో ఏ ఒక్కరూ ఆందోళన కు గురికావద్దన్నారు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్,భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ తో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీలు ఇంధన సరఫరాలను గణనీయంగా పెంచాయన్నారు, డిమాండ్ నీ మించి సరఫరా కొనసాగుతోందని, నేడు 17,246 కిలో లీటర్ల డిమాండ్ ఉండగా 17,898 కిలోలీటర్ల సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. అనగా 652 కిలో లీటర్ల అదనపు నిల్వ మిగిలిందన్నారు.దీనికి తోడు అదనంగా 16,000 కిలోలీటర్ల ఇంధనం నిల్వ ఉంచడంతో పాటు 1200 అదనపు ట్యాంకర్లను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు.వినియోగదారులు గందరగోళంలో పడి పెద్ద ఎత్తున కొనుగోళ్లు చేయడంతొ రోజు వారి డిమాండ్ ఒక్కసారిగా 25% పెరిగినా రోజువారీ సరఫరాలో సగటున పోల్చిచూసినపుడు కుడా ఎక్కడా అంతరాయం కలుగ కుండా అదనంగా 22% అందుబాటులో ఇంధన వనరులు నిల్వలు ఉన్నాయని తెలిపారు, అయితే కొన్ని పెట్రోలు బంక్ లకు నిర్ణిత సమయానికి ట్యంకర్లు చెరుకోక పోవడంతో ఆయా బంక్ లలో నో-స్టాక్ బోర్డులు వెలుస్తున్నాయన్నారు, అయితే అదే సమయంలో షికార్లు చేస్తున్న పుకార్లను నమ్మి వినియోగదారులు కంటైనర్లలో,డబ్బాలలో పెట్రోల్, డీజిల్ ని తీసుకెళ్లడం పూర్తిగా చట్టవ్యతిరేకమైన చర్య అని అంతకు మించి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.పెట్రోలియం నిలువలు రానున్న 65 రోజులకు సరిపడా ఉన్నాయని,సరఫరాలో ఎటువంటి ఆటంకాలు ఎదురు కాకుండా ఉండేలా నిరంతరం కొనసాగేందుకు వీలుగా ఓ జి ఎస్ లైన్ ను విస్తరించినట్లు ఆయన వెల్లడించారు.రాష్ట్ర రాజధానిలో 596 పెట్రోల్ బంక్ లు నిరంతరాయంగా పని చేస్తున్నాయని,హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలో ఎక్కడ కుడా కొరత లేదని,అహ్మదాబాద్, సూరత్,బెంగుళూరు,ధారవాడ ,బెల్గాం వంటి నగరాలలో కూడ ఇదే పరిస్థితి ఉత్పన్నమయ్యాయన్నారు.ఎల్.పి.జి విషయంలో ఎటువంటి కొరత లేదని,కాకపోతే కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో కొంతమేర సమస్య ఉన్నట్లు గుర్తించమన్నారు. ఇదే సందర్భంలో అక్రమంగా వినియోగిస్తున్న 2,952 కమర్షియల్ సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.పెట్రోల్,డీజిల్ గృహ వినియోగదారులకు అవసరమైన ఎల్.పి.జి సమృద్ధిగా అందుబాటులో ఉందని,ప్రజలేవరు అయోమయానికి గురి కావొద్దని,వదంతులను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ముంపు సమస్యపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలి

- సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి
- భద్రాచలం సమస్యలపై సిపిఐఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**భద్రాచలం టౌన్, మార్చి 25 , ప్రజా జ్యోతి:**శ్రీరామనవమి కి భద్రాచల పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి ముంపు సమస్యపై స్పష్టమైన ప్రకటన చేయాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో బుధవారం పట్టణంలో సమస్యలపై సంతకాల సేకరణ అశోక్ నగర్ కొత్త కాలనీ, ముదిరాజ్ బజార్, రామాలయ వీధులలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబి నర్సారెడ్డి మాట్లాడుతూ కరకట్ట పునర్మాణ పనులు చేపట్టకుండా రామాలయ అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఓ పక్క పోలవరం ముంపు ముంచుకొస్తుంటే దానిపై స్పందించకుండా హడావుడి శంకుస్థాపనలు దేనికని అన్నారు. కరకట్ట పునర్మానంతోపాటు గతంలోని శంకుస్థాపన చేసి వదిలేసిన సెంట్రల్ లైటింగ్ పనులపై ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. యాత్రికుల సౌలభ్యం దృష్టిలో పెట్టుకొని డంపింగ్ యార్డ్ ని తరలించాలని, ఐదు పంచాయతీలను భద్రాచలంలో విలీనం చేస్తేనే భద్రాచలంలో నెలకొన్న అనేక సమస్యలకు పరిష్కారం దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పారెల్లి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి చుక్కా మాదారావు, చాట్ల శ్రీనివాసరావు, గోవర్ధన ఝాన్సీ, ఎర్రంశెట్టి పూర్ణిమ , సిహెచ్ ధనలక్ష్మి , దారిశెట్టి సతీష్ బాబు పాల్గొన్నారు.

## రామనవమి, పట్టాభిషేకానికి కట్టుదిట్టమైన బందోబస్తు

- ఎస్పీ రోహిత్ రాజు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 25, ప్రజా జ్యోతి:**
ఈ నెల 27న భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయం, మిథిలా స్టేడియంలో జరగనున్న శ్రీరామనవమి ఉత్సవాలు, తదుపరి 28న నిర్వహించనున్న పట్టాభిషేక కార్యక్రమాల సందర్భంగా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు.ఈ మేరకు భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర విభాగాల అధికారులతో సమన్వయం పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పోలీసు అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని, సెక్టార్ల వారీగా నియమించిన ఇన్‌చార్జ్ అధికారులు తమ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి సారించి, పటిష్టమైన ప్రణాళికతో వాహన రాకపోకలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ఈ వేడుకల సందర్భంగా సుమారు 2,000 మంది పోలీసు సిబ్బందితో విస్తృత స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ స్థలాలు, లడ్డూ కౌంటర్లు, సెక్టార్ల వివరాలను తెలియజేసేలా జిల్లా పోలీసుల తరఫున ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌తో పాటు ఆన్‌లైన్ లింక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. భక్తులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు ప్రజాస్వామ్యానికి ముప్పు: ఏఐఎస్ఎఫ్



**కొత్తగూడెం, మార్చి 25 ( ప్రజాజ్యోతి )** అర్ధరాత్రి సమయంలో విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్చిన చలో అసెంబ్లీ పిలుపు నేపథ్యంలో జరిగిన అరెస్టులను నిరసిస్తూ బుధవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచినా విద్యారంగ హామీలు అమలు కావడం లేదని ఆయన ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ , బెస్ట్ అవైలబుల్ బకాయిలు విడుదలలో జాప్యం జరుగుతోందని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లలో డైట్ , కాస్మోటిక్ చార్జీలు ఆలస్యంగా రావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ప్రకటనలకే పరిమితమై క్షేత్రస్థాయిలో అమలు కనిపించడంలేదని శిథిలావస్థలో ఉన్న హాస్టళ్లకు సొంత భవనాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీకి తగిన నిధులు కేటాయించడం లేదని ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విద్యా వ్యవస్థపై అవగాహన కలిగిన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. అక్రమ అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అణిచివేయలేరని తక్షణమే అరెస్టైన విద్యార్థి నాయకులను విడుదల చేసి విద్యా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకలు

**ఇల్లందు, మార్చి 25, ప్రజాజ్యోతి:** ఇల్లందు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోళ్ళ సూర్యం జన్మదిన వేడుకలను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు భోళ్ల సూర్యం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రేఖ రవిశంకర్, కమల్ కుమార్ కోరి, చెరుకుమల్ల శంకర్, వంగ లోకేష్ కుమార్, ఆఫ్రిద్, మహేష్, సంతోష్, శేఖర్, పాలడుగు రాజశేఖర్, అలీ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వృత్తి విద్యా కోర్సులను సద్వినియోగం చేసుకోండి

- - అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ
- - అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం
- - ఏరియా జీఎం షాలేం రాజు



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 25 – ప్రజాజ్యోతి:**సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో జి.యం.ఆర్. వరలక్ష్మి సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ & లైవ్లీహుడ్స్ సహకారంతో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత వృత్తి విద్యా శిక్షణ అందించనున్నట్లు కొత్తగూడెం ఏరియా జి.యం. ఎం. శాలేం రాజు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వృత్తి విద్యా కోర్సులు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమాలు ప్రముఖ కంపెనీల సహకారంతో అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించబడతాయి. అభ్యర్థులకు ఉచిత వసతి మరియు భోజన సదుపాయం కల్పించబడుతుంది. నిపుణుల ద్వారా సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్ మరియు బేసిక్ కంప్యూటర్ శిక్షణ అందించబడుతుంది. శిక్షణ పూర్తిచేసిన వారికి ఇండస్ట్రీ గుర్తింపు పొందిన సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. అదనంగా ఉద్యోగ అవకాశాల కల్పనలో కూడా సహకారం అందించబడుతుంది. 18 నుండి 28 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని చెప్పారు. ఈ కోర్సుల్లో చేరదలచిన అభ్యర్థులు కొత్తగూడెం ఏరియా సింగరేణి వి.టి.సి వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.యం.తో పాటు ఎస్.ఓ టు జి.యం. ఎం. వెంకటేశ్వరరావు, కోటి రెడ్డి, ఏజీఎం పర్సనల్ జి.వి. మోహన్‌రావు, జి.ఎం.ఆర్ సంస్థ ప్రతినిధులు, ఇతరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఇబ్రహీమ్



**ఇల్లందు, మార్చి 25, ప్రజాజ్యోతి:** హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే కోరం కనకయ్యను బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ ఇబ్రహీమ్ మర్యాదపూర్వకంగా కలిశారు. రంజాన్ పండుగ రోజున వ్యక్తిగత పనులపై హైదరాబాదులో ఉన్నందున ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యేను కలవడంతో ఆలస్యంగా ఎమ్మెల్యే రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారని ఇబ్రహీమ్ పేర్కొన్నారు.

# నేడు సీతారాములకు ఎదుర్కోలు

- రేపు కల్యాణోత్సవం
- దేశ వ్యాప్తంగా భద్రాద్రికి తరలివస్తున్న భక్తులు
- సమీపిస్తున్న సీతారాముల కల్యాణ గడియలు



**భద్రాచలం, మార్చి 25, ప్రజా జ్యోతి:** భద్రుని కొండైన భద్రాచలం శ్రీ సీతారాముల కల్యాణ శోభతో కళకళలాడుతోంది. ఎటు చూసినా స్వాగత ద్వారాలు... చలువ పందిళ్లు... అలంకరణలు... దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న రామాలయ ప్రాంగణం. మొత్తంగా భద్రాచల రామక్షేత్రం భూలోక వైకుంఠంగా భక్తు లకు దర్శనమిస్తోంది. ఎటు చూసినా సీతారాముల కళ్యాణ శోభ.... ఎవరి నోట విన్నా అది దంపతుల ముచ్చటే... శుక్రవారం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కళ్యాణం మిథిల స్టేడియంలోని శిల్పకళా శోభితమైన కళ్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వైకుంఠ ద్వారం వద్ద శ్రీ సీతారామచంద్రస్వామి ఎదుర్కోలు ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు దేవస్థానం అదికారులు ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రామయ్య సన్నిదికి చేరుకుంటున్నారు. కాగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వస్తున్నారు. అలాగే రూ.560 కోట్లతో రామాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకోసం హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఎదుర్కోలు, శ్రీరామనవమి, మహా పట్టాబిషే కంటను పురస్కరించుకొని స్వామివార్లను తీసుకెళ్లే మార్గంలో దేవస్థానం, పోలీసులు సంయుక్త ఆధ్య ర్వంలో పరిశీలించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ సుమారు రెండువేల మందికి పైగా సిబ్బందితో బందోబస్తును నిర్వహిస్తున్నారు. కాగా దేవస్థానం ఆధ్వర్యంలో మూడు లక్షల లడ్డూ లను సిద్ధం చేస్తున్నారు. 26 కౌంటర్ల ద్వారా లడ్డూ ప్రసాద విక్రయాలు, 80 కౌంటర్ల ద్వారా నవమి కళ్యాణ తలంబ్రాల పంపిణీ చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా కళ్యాణ మండపాన్ని 24 సెక్టార్లుగా విభజించగా 34 వేల మంది భక్తులు కల్యాణంను వీక్షించనున్నారు. కాగా ఇందులో 15000 మంది భక్తులు ఉచితంగా స్వామి వారి కళ్యాణాన్ని తిలకించేందుకు వీలుంది. కల్యాణ మండపం ప్రాంగణంలో 50 టన్నుల ఏసీ, 150 కూలర్లు, 250 ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు.

## భద్రాద్రిలో లక్ష్మీనారాయణుల కల్యాణంనే నిర్వహిస్తున్నారు

- సీతారాముల గోత్ర ప్రవరలను సైతం మార్చి చెబుతున్నారు
- విలేకర్ల సమావేశంలో స్వామి స్థిత సజ్ఞానంద సరస్వతి, బూసిరెడ్డి శంకర్‌రెడ్డిల వెల్లడి



**భద్రాచలం, మార్చి 25, ప్రజా జ్యోతి:** భద్రాచలంలో భక్తులందరూ సీతారాముల కల్యాణంను చూసేందుకు వస్తుండగా ఆలయంలో వైదిక బృందం మాత్రం లక్ష్మీనారాయణుల కల్యాణం నిర్వహిస్తున్నారని అంతర్జాతీయ గాంధీ పదం అధ్యక్షుడు భూసిరెడ్డి శంకర్ రెడ్డి, హిమాలయ యోగి ఆధ్యాత్మిక శాస్త్రవేత స్వామి స్థిత సజ్ఞానంద సరస్వతి ఆరోపించారు. భద్రాచలంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ సీతారాముల ఆలయాన్ని లక్ష్మీనారాయణ ఆలయంగా మార్చటానికి చాలా కాలం నుంచి ప్రయత్నాలు జరుపుతున్నారని, భద్రాచలంలో జరగాల్సిన సీతారాముల కల్యాణాన్ని లక్ష్మీనారాయణ కళ్యాణంగా మార్చారన్నారు. ఆలయంలో సీతారాముల కళ్యాణం లో చెప్పాల్సిన గోత్ర ప్రవరలను మార్చి లక్ష్మీనారాయణల గోత్ర ప్రవరణలను చెబుతున్నారని, భద్రాచల క్షేత్రంలో సీతారాములు వెలసిన సన్నిధిలో లక్ష్మీనారాయణల గోత్రాలు ప్రవరలు చెప్పడంతో అది సీతారాముల కళ్యాణం కాదని లక్ష్మీనారాయణ కళ్యాణం అవుతుందని వివరించారు. భక్త రామదాసు సీతారాముల ఆలయాన్ని నిర్మించారు కానీ లక్ష్మీనారాయణ ఆలయాన్ని నిర్మించలేదని అన్నారు. ఆలయం నిర్మించిన నాటి నుంచి సీతారాముల కళ్యాణం జరుగుతుండగా కొన్ని సంవత్సరాలుగా కొందరు కావాలని లక్ష్మీనారాయణ ఆలయంగా మార్చాలని కుట్ర పండుతున్నారని పేర్కొన్నారు.

## శ్రీరామనవమి మహోత్సవ ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 25, ప్రజా జ్యోతి:** శ్రీరామనవమి మహోత్సవాల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్ల పనులను సమర్థవంతంగా, సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్య, విద్యుత్, రహదారులు, ఇరిగేషన్ తదితర శాఖల ద్వారా చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన రక్త నిల్వలు (బ్లడ్ ప్యాకెట్లు), అవసరమైన మందులు, వైద్య సిబ్బంది సిద్ధంగా ఉంచాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకొని హెలిప్యాడ్ ఏర్పాట్లు, బారికేడింగ్ తదితర పనుల పురోగతిని సమీక్షించారు. విద్యుత్ శాఖ అధికారులు ముందస్తుగా అన్ని లైన్లను తనిఖీ చేసి ఎటువంటి లూజ్ కనెక్షన్లు లేకుండా నిశితంగా పరిశీలనలు చేపట్టాలని సూచించారు. మహోత్సవాల సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, వీఐపీలు విచ్చేసే అవకాశం ఉన్నందున దేవస్థానం పరిసర ప్రాంతాల్లోని అన్ని సెక్టార్లలో 24 గంటల పాటు సురక్షితమైన తాగునీటి సరఫరా నిరంతరంగా అందించడంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదావరి స్నాన ఘాట్ల వద్ద భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, హెచ్చరిక బోర్డులు, బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు గజతగాళ్లు (స్విమ్మర్లు) అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీరామనవమి మహోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల సంతకు స్థలం కేటాయించాలి

- ఇరప. రాజు ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్



**చర్ల, మార్చ్ 25: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు పశువుల సంతను ఉద్దేసించి పత్రికా ప్రకటన విడుదలచేసారు. చర్ల మండలంలో అత్యధిక ఆదాయం ఉన్న పశువుల సంతను నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇరప. రాజు ఆరోపించారు. పశువుల సంత పాట సమయం రాగానే అర్హతలేని గిరిజనేతరులు అమాయకులైన ఆదివాసీలను బీనామిలుగా వాడుకోని లక్షలాది రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఆదివాసీ చట్టాలను అతిక్రమించి భూ బదలాయింపులు, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆదివాసీ చట్టాలు నీరుగారుతున్నాయని మండిపడ్డారు. 5 లక్షలు ఉన్న పశువుల సంత వేలం పాటను ఆదివాసీలు పాల్గొనకుండా 50 లక్షలు చేశారని అంత డబ్బు ఆదివాసీ ప్రజల దగ్గర ఎక్కడ ఉందని ప్రశ్నించారు. పశువుల సంతను నీరుగార్చే కుట్రలో భాగంగానే ఇది జరిగిందని అన్నారు. దాదాపు (50 లక్షలు) అరకోటి రూపాయ లు పలికే పశువుల సంత వేలం పాటలో భద్రాచలం ఐటిడిఏ పీఓ, జిల్లా పంచాయ తీ అధికారి పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఇక్కడి అధికారులు గిరిజనేతరులతో కుమ్మక్కై అసలైన ఆదివాసీ అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఉన్నత అధికారులు పశువుల సంతలో పాల్గొన్నప్పుడే ఎవరికి లబ్ది చేకూరుతుందో తెలుస్తోందని అన్నారు.

## కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు కోరం



**టేకులపల్లి, మార్చి 25, ప్రజాజ్యోతి:** మండలంలోని పాతర్లగడ్డ గ్రామంలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారిలో నూతనంగా మంజూరైనా కల్వర్ట్ ను పనుల ను బుధవారం ఇల్లందు నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ప్రారంభించారు. గ్రామస్థులతో కలిసి కోరం సురేందర్ కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో ఆర్ సి పేట సర్పంచ్ వాసం సువర్ణ ఉప సర్పంచ్ రాఘవేందర్, మండల కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, మధురెడ్డి, పోశాలు, సైదులు, వాసం కిరణ్, శివ, వార్డ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రయాణికులు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కొత్త మార్గం

- జాతీయ రహదారి సెకండ్ డైవర్షన్ అలైన్మెంట్ పరిశీలన



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 25 – ప్రజాజ్యోతి:** ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జాతీయ రహదారి పొడిగింపులో భాగంగా రెండూ రాష్ట్రాలను కలిపే కొత్త మార్గం ఏర్పాటుపై సంబంధిత అధికారులు బుధవారం ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. వికేఓసి ఎక్స్టెన్షన్ లో భాగంగా ప్రస్తుతమున్న జాతీయ రహదారిని తొలగించి వేరే మార్గంలో ఏర్పాటు చేసే ప్రతిపాదనపై సంబంధిత జాతీయ రహదారి అధికారులు, సింగరేణి అధికారులతో చర్చలు జరిపారు. అందుకు సంబంధించిన మ్యాప్ ను పరిశీలించారు. త్వరితగతిన స్థల పరిశీలన రహదారి మార్గం భద్రత అంశాలు భవిష్యత్ నిర్మాణ పనులపై చర్యలు తీసుకొని వేగవంతంగా రహదారి నిర్మాణం జరిగిన చూడాలని ఈ సమీక్షలో చర్చించారు. ఈ సందర్శనలో భాగంగా వికేసిఎం ఎక్స్టెన్షన్ ఫేస్ 2 ప్రతిపాదిత డైవర్షన్ అలైన్మెంట్ కు సంబంధించిన స్థల పరిస్థితులు, రహదారి మార్గం, భద్రతా అంశాలు, భవిష్యత్ నిర్మాణ పనులపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శాలెం రాజు, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, అసిస్టెంట్ కిరణ్, నేషనల్ హైవే కన్సల్టెంట్, ఏరియా సర్వే ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ ఆఫీసర్ (వీకే సీఎం) ఎం.వి నరసింహారావు, ఏజీఎం (సివిల్) రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామాలయ అభివృద్ధికి రూ.351 కోట్లు మంజూరు

(మొదటి పేజీ తరువాయి...)

జి.ఓ. ఆర్.టి. నెం.167 ద్వారా ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. రామాలయం సమగ్ర అభివృద్ధి కోసం మూడు దశల్లో మొత్తం రూ.586 కోట్ల వ్యయంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయబడింది. ఇందులో తొలి దశ పనుల కోసం రూ.351 కోట్లు మంజూరు చేయగా, మిగిలిన దశలను దశలవారీగా అమలు చేయనున్నారు. గత సంవత్సరం మార్చి 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటన సందర్భంగా ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆ మేరకు దేవాదాయ శాఖ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు ముఖ్యమంత్రి ఆమోదం తెలపడంతో తొలి దశ పనులకు పరిపాలన ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదిలా ఉండగా, రాబోయే శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించడంతో పాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. భద్రాద్రి రామాలయం అభివృద్ధికి భారీ నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## రాష్ట్ర పోలీస్ క్రీడల్లో ద్విగుణిత స్వర్ణాలు

- **మహిళా కానిస్టేబుల్ సుష్మకు ఎస్పీ అభినందనలు**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మార్చి 26, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చాటిన జిల్లా ఏఆర్ విభాగానికి చెందిన మహిళా కానిస్టేబుల్ డి. సుష్మను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన ఈ క్రీడల్లో సుష్మ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెం విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేసి రెండు బంగారు పతకాలను సాధించారు. అనంతరం పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొని ఐదవ స్థానంలో నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం తన కార్యాలయంలో సుష్మను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని, గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని, ఓటములను నిరుత్సాహంగా తీసుకోకుండా భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పనులు త్వరితగతిన పూర్తి చేయండి

- **రుద్రంపూర్ రైల్వే సైడింగ్‌లను పరిశీలించిన రైల్వే అధికారులు**

**కొత్తగూడెం సింగరేణి, మార్చి 25 – ప్రజాజ్యోతి:** రైలు మార్గం ద్వారా జరిగేందుకు చేపట్టిన రైల్వేసైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రైల్వే అధికారులు సింగరేణి అధికారులకు సూచించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సిహెచ్‌పి, రుద్రంపూర్ రైల్వే సైడింగ్‌లను రైల్వే అధికారులు బుధవారం పరిశీలించారు. సీనియర్ డిఓఎం నరేంద్ర వర్మ, డిఈఈ దీపేంద్ర మార్వార్, సీనియర్ డిఈఈ ఆర్. ప్రసన్న కృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఇంజనీర్ కె. సూర్యనారాయణ రాజు, ఆర్‌సిహెచ్‌పి ఇన్‌చార్జ్ ఎస్.ఈ (ఈ & ఎం) అజ్మీర శ్రీనివాస్ రైల్వే అధికారులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్శనలో భాగంగా రైల్వే అధికారులు కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సిహెచ్‌పి, రుద్రంపూర్ రైల్వే సైడింగ్‌ను సింగరేణి అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైటింగ్ సదుపాయాలు, రవాణా సంబంధిత అంశాలను పరిశీలించారు.



## రాహుల్ విజ్ఞాన్ లో ఘనంగా కిడ్స్ ఫెస్ట్ వేడుక






**చర్ల, మార్చి 25 : (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వ్యవస్థాపకులు డా. డి.ఎన్. కుమార్ డా. ప్రతిభల కుమారుడు, స్వర్గీయ రాహుల్ వర్ధంతిని పురస్కరించుకుని రాహుల్ విద్యాలయ ప్రాంగణంలోని కళాభవన్ లో ‘కిడ్స్ ఫెస్ట్’ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్మ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చర్ల ఎస్.ఐ. నర్సిరెడ్డి మండల విద్యాశాఖ అధికారి పరిటాల వెంకట రమణ లు పాల్గొన్నారు.ముందుగా స్వర్గీయ రాహుల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం, జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంలో ఇలాంటి కిడ్స్ ఫెస్ట్ వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, చదువుతో పాటు కళలు, క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని. పిలుపునిచ్చారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని రాహుల్ చిన్నారుల చేత దృశ్య కావ్యంగా చూపించటం జరిగింది. ఈ దృశ్య కావ్యాన్ని అద్భుతంగా అభినయించిన చిన్నారులు పలువురు నుండి ప్రశంసలు అందుకున్నారు. ఏజెన్సీ ప్రాంతం లో గత 25 సంవత్సరాలు గా విద్యారంగం లో సేవలు అందిస్తున్న . డి.ఎన్. కుమార్ డా. ప్రతిభలను కార్యక్రమానికి విచ్చేసిన పలువురు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు చింతూరి వెంకటరావు,ఎస్ కె .షాజహాన్, గుమ్మడి భారతి, కొసరాజు శిరీష, హరి చరణ్, పాత్రికేయులు , ఉపాధ్యాయులు ఎం.వి.ఎల్. నరసింహ రావు, గురజాల రామారావు, బోసు బాబు, క్రాంతి కుమార్, ఉస్మాన్, సునీత, శ్రీధర్ బాబు, ఆనంద్ సునీత, రమ , జ్యోతి ,చైతన్య,ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయులు మీసాల మాధురి , లావణ్య , మౌనిక ,శిరీష గారితో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక

- **గ్రంథాలయ పండుగ**



**టేకులపల్లి,మార్చి25, ప్రజాజ్యోతి:** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమాన్ని పురస్కరించు కొని బుధవారం టేకులపల్లి గ్రంథాలయంలో గ్రంధాలయ పండుగ,సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీర బాబు, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్,జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే.కరుణ కుమారి,మొదటి సభ్యత్వం టేకులపల్లి సర్పంచ్ బోడా బాలు తీసుకున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రంథాలయంలో చాలా విలువైన పుస్తకాలు ఉన్నాయని విద్యార్థులు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ టేకులపల్లి మండలంలో గ్రంధాలయానికి కొత్త భవనం రాబోతుందని ఇప్పుడున్న గ్రంథాలయంలో చాలా విలువైన పుస్తకాలు ఉన్నాయని విద్యార్థులు పుస్తక ప్రియులు తప్పకుండా ఉపయోగించుకోవాలని అన్నారు.గ్రంధాల సంస్థ కార్యదర్శి మేడం మాట్లాడుతూటేకులపల్లి మండలంలో చాలామంది విద్యావంతులు గ్రంథాలయానికి చక్కని సహాయం చేస్తున్నారు, గ్రంథాలయానికి కొత్త భవనం కూడా రాబోతుంది, కాంపిటేటివ్ కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆర్.నాగన్న, ఆర్ ఐ రత్తయ్య,టేకులపల్లి ఉపసర్పంచ్ అనంతుల వసంత, వార్డు మెంబర్ కొక్క, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఘనంగా కలశ ప్రతిష్ట పూజలు

- **పూజల్లో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు**



**పాల్వంచ, మార్చి 25, ప్రజాజ్యోతి:** పాల్వంచ మార్కెట్‌లోని శ్రీ రామాలయ భజన మందిరం, శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో రాజగోపురం, ప్రాకార గోపురాల కలశ ప్రతిష్ట పూజలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీ కుమారి ఆధ్వర్యంలో అర్చకులు ప్రతిష్టా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ఆయనను సత్కరించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో ఎన్. రజనీ కుమారి సిబ్బంది, పూజారి కందాల ఆనంద కుమార్ ఆచార్యులు, ధనలక్ష్మి రాము, కాంట్రాక్టర్ లక్ష్మిపతి కిషోర్, రాకేష్ పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయం ఎదుట గుత్తేదారుని గోస

- **ఏండ్లు గడిచిన రాని బిల్లులు, నాకు మరణమే శరణం అంటున్నా గుత్తేదారుడు**



**అశ్వాపురం , మార్చి 25, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం పరిధి లో ని మొండికుంట గ్రామం కి చెందిన జాలే శ్రీనివాసరెడ్డి గత 6 నుంచి 7 సంవత్సరాల క్రితం మిషన్ భగీరథ కాంట్రాక్టు పనులు మను పోతులగూడెం,గొల్లగూడెం,ఎలకగూడెం ఏరియా లో పనులు పూర్తి చేశాను. గత కొన్ని సంవత్సరా లుగా బిల్లులు అయితఏమో అని ఎదురు చూసి కండ్లు కాయలు కట్టాయి. ఓపిక నశించి గ్రామపంచాయతీ సర్పంచ్ ని అడిగితే, పంచాయతీ సెక్రటరీ పేరు చెప్పడం, పంచాయత్ సెక్రెటరీని అడిగితే ఎంపీడీవో కార్యాలయంలో కలవమని చెప్పడం ఇలా అధికారుల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరిగి చెప్పులు అరిగాయి తప్ప ఫలితం మాత్రం శూన్యం. డబ్బులు లేక నా కొడుకు చదువు కు ఫీజులు కట్టలేక నా కొడుకు చదువు నాశనం అయ్యే పరిస్థితి వచ్చింది. నా కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. అయ్యా అధికారులకు పాత్రికేయులకు పోలీసులు వారికి తెలియజేసేది ఏమిటంటే నా బిల్లులకు "ఎంబి" అయిపోయినది అయినా డబ్బులు నాకు ఇవ్వకపోవడంలో మర్మం ఏమిటో నాకు అర్థం కావడం లేదు. అందుకే నా కుటుంబ సభ్యులతో ఎంపీడీవో ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్నాను. ఇక్కడ గనక నాకు న్యాయం జరగకపోతే కుటుంబ సభ్యులతో సహా నడిరోడ్డుపై ఆత్మహత్య చేసుకుంటానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.